క్లుప్తంగా

ఉపాధ్యాయుల సమస్యలపై 'చలో విజయవాడ'



ముమ్మిడివరంలో బ్రోచర్లను ఆవిష్కరించిన ఉపాధ్యాయులు

ముమ్మిడివరం: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 7న చేపట్టనున్న చలో విజయవాడ కార్యక్రమానికి ఉపాధ్యాయులంతా తరలివచ్చి విజయవంతం చేయాలని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య సభ్యులు పిలుపునిచ్చారు. ముమ్మిడివరం బల్లగేటు సెంటర్‌లోని పాఠశాల వద్ద శనివారం చలో విజయవాడ బ్రోచర్లను ఉపాధ్యాయులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కలిగించాలని, ఉమ్మడి సర్వీసు నిబంధనలు అమలు, 12వ పీఆర్సీ అమలు, మధ్యంతర భృతి విడుదల తదితర డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. టి.దుర్గాప్రసాద్, పెన్నాడ శ్రీనివాసరావు, ఎస్ఎస్ మున్నేశ్వరరావు, రెడ్డి నాగార్జున, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

భీమేశ్వర సిద్ధాంతికి ఘన సత్కారం



భీమేశ్వర సిద్ధాంతిని సత్కరించిన దేవాంగ సంఘ నాయకులు

అమలాపురం రూరల్: శ్రీశైలం దేవాంగ సత్రం కమిటీ ఆధ్వర్యంలో తిరుపతిలో నిర్మించిన శ్రీనివాస ఉమా రామలింగేశ్వర నిత్య అన్నదాన సత్రం ప్రారంభోత్సవంలో అమలాపురం బండారులంక చెందిన ప్రముఖ సిద్ధాంతి కాలెపు భీమేశ్వర సిద్ధాంతిని ఘనంగా సన్మానించారు. సువర్ణ సింహ తలాటంతో భీమేశ్వర సిద్ధాంతిని సత్రం అధ్యక్షుడు బొమ్మన దుర్గాప్రసాద్, రాష్ట్ర దేవాంగ సంఘం అధ్యక్షుడు ఊటుకూరి సుబ్రహ్మణ్యస్వామి సత్కరించారు. ఈ దేవాంగ సత్రం నిర్మాణానికి కాలెపు భీమేశ్వరరావు సిద్ధాంతిగా వ్యవహరించి వాస్తు ప్రకారం ప్లాన్ రూపొందించడంతో ఆ సత్రం ఎంతో సుందరంగా రూపుదిద్దుకుంది. ఈ సందర్భంగా కాలెపు భీమేశ్వర సిద్ధాంతిని సువర్ణ సింహ తలాటంతో సత్కరించారు.

పౌర హక్కులపై సదస్సు

ఉప్పలగుప్తం: స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం సర్పంచ్ కడిమి చిన్నవరాజు అధ్యక్షతన పౌర హక్కుల అవగాహన సదస్సును నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ జిల్లా సభ్యురాలు పుణ్యమంతుల రజిని మాట్లాడుతూ గ్రామాల్లో ఎస్సీ,ఎస్టీ వర్గాలు అన్యాయాలకు గురికాకుండా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మరో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ జిల్లా సభ్యుడు వెంట్రు పృథ్వీ మాట్లాడుతూ పౌర హక్కులకు భంగం వాటిల్లితే సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. తహసీల్దార్ వీఎస్ దివాకర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు చట్టాలపై అవగాహన కల్పించేందుకు ప్రతినెల పౌర హక్కులపై సమావేశాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఎంపీటీసీ సభ్యురాలు తాళ్ల లక్ష్మీనరసాయమ్మ డిప్యూటీ తహసీల్దార్ జి.లలిత దళిత నాయకులు తాళ్ల రవి పాల్గొన్నారు.

సాహితీవేత్త నరసింహమూర్తికి బుక్ ఆఫ్ రికార్డ్స్ పురస్కారం



నరసింహమూర్తికి బుక్ ఆఫ్ రికార్డ్స్ పురస్కారాన్ని అందిస్తున్న ఎంపీ హరీష్ మాథుర్

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన సాహితీవేత్త, శ్రీశ్రీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహామూర్తికి ఇంటర్నేషనల్ కల్చరల్ టాలెంట్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు లభించింది. ఈ అవార్డును ఎంపీ హరీష్ మాథుర్ చేతుల మీదుగా నరసింహమూర్తి శనివారం అందుకున్నారు. స్థానిక ఎంపీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన శ్రీశ్రీ కళా వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కత్తిమండ ప్రతాప్, కోనసీమ రచయితల సంఘం అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ, ముమ్మిడివరం మదర్ థెరిస్సా మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు మెండి కమల తదితరులు పాల్గొని నరసింహమూర్తిని అభినందించారు. నరిసింహమూర్తిని ఈ సందర్భంగా ఎంపీ ఘనంగా సత్కరించి అభినందించారు.

దళిత ఉద్యమ నేత ఏడుకొండలు మృతి

తాళ్లరేవు: దళిత ఉద్యమ నాయకుడు, విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు శనివారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందారు. ఆయనకు గుండెపోటు రావడంతో ఇటీవల కాకినాడ ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఏడుకొండలు మృతికి దళిత, ప్రజా సంఘాలు, నాయకులు సంతాపాన్ని తెలిపారు

ఖరీఫ్ ఆశలు ఆవిరి



భీమనపల్లిలో కలువ పువ్వులతో నిండిన వరి చేను



ఉప్పలగుప్తంలో ముంపునకు గురై కుళ్లిన వరి చేను

- ఖరీఫ్ దిగుబడిపై రైతుల వర్రీ
- నీటి పాలవుతున్న పంటలు
- వృథా అవుతున్న పెట్టుబడులు
- అన్నదాతలపై అప్పుల భారం
- ఆదుకోని కూటమి ప్రభుత్వం

ఉప్పలగుప్తం: ప్రస్తుతం వ్యవసాయమే జీవనాధారంగా నమ్ముకుని వరి సాగు చేస్తున్న అన్నదాత ప్రకృతి సహకరించక పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా వరి సాగు చేస్తున్న రైతన్నకు ఏటా ఆటు పోట్లు ఎదురవుతూనే ఉన్నాయి. కష్టాన్ని నమ్ముకుని ఖరీఫ్ సాగు చేసిన కర్షకులు అడుగడుగునా అడ్డంకులతో అవస్థలు పడుతున్నారు. వ్యవసాయం గట్టెక్కిస్తుందని నమ్మి అప్పులు తెచ్చి సాగు చేస్తున్న రైతుకు తిప్పలు తప్పటంలేదు. కొన్నేళ్లుగా ముంపు భయంతో ఖరీఫ్ సాగుకు పంట విరామం ప్రకటిద్దాం అనుకున్న రైతులకు ప్రభుత్వం ఒత్తిడితో సాగు చేపట్టక తప్పలేదు.

భారీ వర్షాలు, వరదలతో నష్టాలు

దుక్కి దున్ని, నారుపోసి, నాట్లు నాటి ఖరీఫ్ సాగు చేపట్టిన రైతులకు ఆరంభం నుంచి పరిస్థితి అవస్థలమయంగా మారింది. దీనికి కారణం రెండు నెలలుగా కురిసిన భారీ వర్షాలకుతోడు ఎగువ ప్రాంతాల నుంచి నీరు పోటెత్తడంతో గోదావరికి ఐదు సార్లు వచ్చిన వరదల కారణంగా పంట పొలాలన్నీ జలమయమయ్యాయి. మైనర్, మేజర్, మీడియం డ్రెయిన్లలో నీరు వరిచేల కంటే ఎగువ ప్రాంతాల్లో ఉండటంతో ముంపు దిగక కొన్నిచోట్ల చేలు కుళ్లిపోయి, మరికొన్ని చోట్ల దుబ్బు చేయని పరిస్థితిల్లో కనిపిస్తున్నాయి. వరి దుబ్బు పలుచబడి కలువ పువ్వు విస్తరించి వరి పంట కలువల పంటగా దర్శనమిస్తోంది. దీనితో వ్యవసాయమే ఆధారంగా బతుకుతున్న రైతులు కొందరు విసుగు చెంది పంటల సాగుకు దూరమవుతున్నారు.

1,200 ఎకరాల్లో వరి పంటకు నష్టం

అమలాపురం నియోజకవర్గంలో అల్లవరం, ఉప్పలగుప్తం, అమలాపురం మండలాల్లో 11,570 ఎకరాల్లో రైతులు ఖరీఫ్ సాగు చేపట్టారు. నెల రోజుల క్రితం కురిసిన వర్షాలకు డ్రెయిన్లు దిగక దాదాపుగా 1,200 ఎకరాల్లో వరిసాగు ముంపునకు గురయ్యింది. కొన్ని చోట్ల ఇంజన్ల సహాయంతో ముంపు నీటిని బయటకు తోడుతున్నా ఎటువంటి ప్రయోజనం కనిపించడం లేదని రైతులు అంటున్నారు. తరచూ పంటలు ముంపు బారిన పడుతుండటంతో సాగును ముందుకు ఎలా సాగించాలో తెలియక రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ముంపు నీరు డ్రెయిన్ల ద్వారా దిగకపోవటంతో వరి దుబ్బులు కుళ్లిపోయే పరిస్థితి కొన్ని ప్రాంతాల్లో నెలకొంది.

గతంలో ఖరీఫ్ వరి సాగు చేసిన రైతుకు 30 నుంచి 35 బస్తాల ధాన్యం దిగుబడి వచ్చేది. దీనితో పండించిన పంటకు గిట్టుబాటు కలిగి పెట్టుబడులు చేతికొచ్చేవి. ఈ సంవత్సరం వరి సాగు చేసిన రైతులకు కొన్నిచోట్ల కనీసం 5 నుంచి 15 బస్తాల దిగుబడి వచ్చే పరిస్థితి నెలకొంది. మరికొన్ని చోట్ల వరి చేను పూర్తిగా కుళ్లిపోయి కనీసం పశువుల మేతకు కూడా ఉపయోగపడేలా లేదని రైతన్నలు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికే వరి సాగు చేసిన రైతులు దాదాపు రూ.15 వేల వరకూ పెట్టుబడి పెట్టారు. పంట పూర్తిగా పండితే పెట్టుబడి వ్యయం అయినా చేతికొస్తుందని, మధ్యలోనే ఆటంకాలు కలగడంతో దిగుబడిపై ఆశలు వదులుకున్నామని రైతులు వాపోతున్నారు.

ఏటా నష్టం పోతున్నాం



ఖరీఫ్ సాగులో ఏటా నష్టం కలుగుతోంది. నేను రెండు ప్రాంతాల్లో వరి సాగు చేశాను. ఒక ప్రాంతంలో ముంపు నీటిలో వరి చేను మునిగి ఉంది. మరొక చోట ముంపు నీరు కొంతమేర తగ్గినా చేను దుబ్బు చేసే పరిస్థితి లేదు. ఎకరానికి దాదాపుగా రూ.15వేలు ఖర్చు చేశాను. కనీసం పెట్టుబడులు వచ్చే అవకాశం కనిపించడంలేదు.

– నల్లా వెంకట నారాయణ, గొల్లవిల్లి, ఉప్పలగుప్తం మండలం

డ్రెయిన్లను ఆధునీకరించాలి



భీమనపల్లి పంచాయతీ శివారు వడ్డి చెరువు ప్రాంతంలో ఎనిమిది ఎకరాల్లో సాగు చేస్తున్నాను. ఏడాదికి మూడు పంటలు పండే వ్యవసాయ భూముల్లో డ్రెయిన్లు సక్రమంగా లేక ప్రకృతి వైపరీత్యాలతో కనీసం ఒక పంటను కూడా లాభదాయకంగా పండించుకోలేకపోతున్నాం. డ్రెయిన్లను ఆధునీకరించాలని అధికారులకు మొరపెట్టుకున్నా ప్రయోజనం ఉండటం లేదు.

– కోలపల్లి పట్టాభిరాముడు, భీమనపల్లి, ఉప్పలగుప్తం మండలం

పంట నష్టం ఊసెత్తడం లేదు

గత ప్రభుత్వం హయాంలో ఈ క్రాప్ పొందిన రైతులకు ఇటువంటి పరిస్థితుల్లో పంట నష్టం అందించేవారని, ప్రస్తుతం అధికారులు, కూటమి పాలకులు ఈ క్రాప్ నమోదు చేస్తున్నారే తప్ప పంట నష్టం ఊసెత్తడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి పంటను కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందించకుంటే అప్పుల ఊబిలో కూరుకుపోక తప్పదని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు.

దాడులను అరికట్టాలి



వెంకటేశ్వరరావును పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, వైఎస్సార్ సీపీ నాయకులు

అమలాపురం టౌన్: ఇటీవల జరిగిన దాడిలో గాయపడి అమలాపురంలోని తన ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న స్థానిక మున్సిపల్ కాంట్రాక్టర్ కడలి వెంకటేశ్వరరావును ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ శనివారం పరామర్శించారు. ఇలాంటి దాడులను అరికట్టేందుకు పోలీసులు చర్యలు తీసుకోవాలని, తక్షణమే దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్ వెంకటేశ్వరరావుకు ఎమ్మెల్సీ ధైర్యం చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకులు కముజు రమణ, వేగిరాజు సాయిరాజు, కట్టోజు సన్నయ్యదాసు, దొంగ చిన్నా తదితరులు వెంకటేశ్వరరావును పరామర్శించారు.

గృహ నిర్మాణాలకు రూ.1.29 కోట్లు మంజూరు

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో ఎస్సీ లబ్ధిదారులకు గృహ నిర్మాణాలకు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ద్వారా రూ.1.29 కోట్లు సహాయం మంజూరయ్యిందని శనివారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. నియోజకవర్గ పరిధిలో 81 మంది ఎస్సీ లబ్ధిదారులకు బీఎల్సీ కాంపోనెంట్ ప్రధానమంత్రి ఆవాస్ యోజన (అర్బన్) 2.0 స్కీమ్ ద్వారా అడ్మినిస్ట్రేటివ్ అప్రూవల్ పొందినవారికి కేంద్రం వాటా రూ.90 వేలు, రాష్ట్రం వాటా రూ.1.60వేలు, మొత్తం ఒక్కొక్కరికి రూ.2.50 లక్షలు ఇవ్వనున్నట్టు తెలిపారు. మొదటి విడతగా ఒక్కొక్కరికీ రూ.1.29 వేలు మంజూరైనట్టు తెలిపారు.

డిజిటల్ బుక్‌తో వైఎస్సార్ సీపీ శ్రేణులకు భరోసా



డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్‌ని ప్రదర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

అల్లవరం: కూటమి ప్రభుత్వంలో అన్యాయానికి గురైన పార్టీ కార్యకర్తలకు భరోసా ఉండేందుకు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. అల్లవరంలో మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ నివాసంలో శనివారం డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ప్రదర్శించారు. కూటమి ప్రభుత్వం వైఎస్సార్ సీపీ నాయకులను, కార్యకర్తలను అక్రమ కేసులతో నిర్బంధించి, వేధింపులకు గురి చేస్తోందన్నారు. ప్రభుత్వం, పోలీసుల నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటే డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి వివరాలు పోస్టు చేయాలన్నారు. ఈ విధంగా చేయడం ద్వారా కార్యకర్తలకు భరోసా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, పార్టీ నాయకులు యల్లమిల్లి బోసు, తిక్కా ప్రసాదు, పల్లి జేమ్స్, తుట్టెపు బాబీ, పాటి శ్రీరామ్, గోసంగి వెంకటేశ్వరరావు, పులుసుగంటి గంగాధర్, కంపాని రాజేష్, కొనుకు మహేష్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



గొల్లవిల్లిలో కిరణ్, సూర్యప్రకాష్‌ను సత్కరిస్తున్న పార్టీ నాయకులు

ఉప్పలగుప్తం: పార్టీలో నూతనంగా పదవులు పొందిన నాయకులు పార్టీ బలోపేతాని కృషి చేసి రాబోయే రోజుల్లో వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకురావాలని జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు అన్నారు. మండలంలోని గొల్లవిల్లిలో ఇటీవల అమలాపురం నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన గెద్దం కిరణ్‌కుమార్, ఆర్టీఐ విభాగం అధ్యక్షుడిగా నియమితులైన నల్లా సూర్యప్రకాష్‌ను మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు శనివారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సాదే శ్రీనువాసరావు, సర్పంచులు కడిమి చిన్నవరాజు, జొన్నాడ శ్రీదుర్గ, యర్రంశెట్టి రామచంద్రరావు, రైతు విభాగం జిల్లా అధ్యక్షులు జిన్నూరి వెంకటేశ్వరరావు, బూత్ కమిటీల విభాగం జిల్లా అధ్యక్షులు చీకట్ల కిషోర్, జిల్లా కార్యదర్శులు దంగేటి దొరబాబు, పొగాకు శ్రీను, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పోతుమూడి కొండబాబు, పార్టీ నాయకులు సలాది సతీష్, కుంచే స్వామి, భోగిశెట్టి నరసింగరావు, కోరుకొండ కిరణ్, నల్లా నాయుడు, జొన్నాడ చిన్నీ, రేవు రాజేష్, పోలిశెట్టి వీర్రాజు, సలాది పట్టాభి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు విద్యా సామగ్రి వితరణ



ఉప్పలగుప్తంలో దాత ఉమామహేశ్వరరావును సత్కరిస్తున్న సర్పంచ్ చిన్నవరాజు, ఎంఈవో

ఉప్పలగుప్తం: స్థానిక గ్రామ పంచాయితీ పరిధి కొత్త చెరువు ఎంపీపీ పాఠశాలకు, విద్యార్థులకు అవసరమైన సామగ్రిని గ్రామానికి చెందిన మట్టపర్తి ఉమామహేశ్వరరావు అందజేశారు. విద్యార్థుల సౌకర్యార్థం సీలింగ్ ఫ్యాను, కుర్చీలు, ఆట వస్తువులను ఎంఈవో సత్తి సత్యకృష్ణ సమక్షంలో ప్రధానోపాధ్యాయులు వంగా రాజేంద్రప్రసాద్‌కు అందించారు. ఈ సందర్భంగా ఆయనను ఎంఈవో, పాఠశాల సిబ్బంది సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు ఆధ్వర్యంలో దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కాదంబరి రామకృష్ణ, సీఆర్పీ పినిశెట్టి నాగేశ్వరరావు, గ్రామ పెద్దలు నామాడి వెర్రియ్య, తాళ్ల వెంకటరావు, కాశి పల్లంరాజు, పినిపే కొండబాబు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ కమిటీల ప్రతినిధులకు అభినందన



చిర్ల జగ్గిరెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ అనుబంధ కమిటీల నేతలు



వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డితో పితాని బాలకృష్ణ, కాశి బాలమునికుమారి

అమలాపురం టౌన్: అమలాపురం, ముమ్మిడివరం నియోజక వర్గాల్లో ఇటీవల వైఎస్సార్ సీపీ అనుబంధ కమిటీలకు పదవులు లభించిన పార్టీ నాయకులు జిల్లా పార్టీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డిని శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. రావులపాలెం మండలం గోపాలపురంలోని జగ్గిరెడ్డి స్వగృహంలో ఆయనను పార్టీ నాయకులు కలిసినప్పుడు వారిని ఆయన అభినందించారు. అనుబంధ కమిటీల్లో పదవులు పొందిన పార్టీ నాయకులు ఉండ్రు వెంకటేష్, ఈతకోట శ్రావణ్, ఉండ్రు బాబ్జి, కుంచె సుబ్బు, కాశి రామకృష్ణ, చింతా రామకృష్ణ జగ్గిరెడ్డిని కలిసి ఆయనను కృతజ్ఞతగా గజమాలతో ఘనంగా సత్కరించారు. పార్టీ పటిష్టత కోసం అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో కృషి చేయాలని జగ్గిరెడ్డి వారికి సూచించారు.

జగ్గిరెడ్డిని కలిసిన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు

ముమ్మిడివరం: వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (సీఈసీ) సభ్యుడిగా ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబరు (ఎస్ఈసీ)గా ఆ పార్టీ రాష్ట్ర మహిళా విభాగం అధికార ప్రతినిధి కాశి బాలమునికుమారిని పార్టీ అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా వారు పార్టీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. బాలకృష్ణ, బాలమునికుమారిని ఆయన శాలువా కప్పి సత్కరించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్, నియోజకవర్గ కన్వీనర్ పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, పార్టీ ప్రముఖులకు ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పితానికి పలువురి అభినందనలు

వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబరుగా నియమితులైన పితాని బాలకృష్ణను శనివారం పలువురు నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. అయినాపురం సర్పంచ్ మోకా రామారావు, మండల వైస్ ఎంపీపీ మట్టపర్తి సురేష్, ఎంపీటీసీ సభ్యులు బొంతు శ్రీనివాసరావు, పలువురు నాయకులు ఉన్నారు.



పితాని బాలకృష్ణను సత్కరించిన నాయకులు

నూతన దంపతులకు వైఎస్సార్ సీపీ నేతల ఆశీర్వాదం



కిరణ్ దంపతులను ఆశీర్వదిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్



కిరణ్ దంపతులను ఆశీర్వదిస్తున్న జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు, కోఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్

అమలాపురం రూరల్: సత్యనారాయణ గార్డెన్స్‌లో శనివారం జరిగిన ఏపీ ఫుడ్ కమిషన్ సభ్యుడు జక్కంపూడి కిరణ్ శ్యామల వివాహ రిసెప్షన్‌కు రాజకీయ ప్రముఖులు విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, జక్కంపూడి రాజా, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్త ప్రతాప్‌రెడ్డి, ప్రచార విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ హరిప్రసాద్‌రెడ్డి, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, మాజీ ఎంపీ చింతా అనురాధ, మాజీ హోం మంత్రి తానేటి వనిత, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, నియోజకవర్గ కోఆర్డినేటర్లు పినిపే శ్రీకాంత్, గన్నవరపు శ్రీనివాస్, పొన్నాడ సతీష్‌కుమార్, పిల్లి సూర్యప్రకాష్, సత్తి సూర్యనారాయణ రెడ్డి, కర్రి పాపారాయుడు, పితాని బాలకృష్ణ, చెల్లుబోయిన శ్రీనివాసరావు, గొల్లపల్లి డేవిడ్, వైఎస్సార్ సీపీ నాయకులు జక్కంపూడి గణేష్ తదితరులు నూతన జంటను ఆశీర్వదించారు.

రీజెన్సీ భూమిని కార్మికులకు పంచాలి

యానాం: రీజెన్సీ ఫ్యాక్టరీ కార్మికులకు యాజమాన్యం 29 ఎకరాలు ఇవ్వడం ద్వారా 665 మందికి ఆ భూమిని పంచడానికి సరిపోతుందని శనివారం రీజెన్సీ సిరామిక్స్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ సహాయ కార్యదర్శి జీవీ సూర్యనారాయణవర్మ పేర్కొన్నారు. 2012 మార్చి ఒప్పందం ప్రకారం ఫ్యాక్టరీ భూమిని కార్మికులకు అప్పగించాల్సి ఉందని ఆయన అన్నారు.

'లిదియా పూలు సలామీ అఖాతం' పుస్తకావిష్కరణ




కవితా సంపుటిని ఆవిష్కరించిన కవి శ్రీధర్

అమలాపురం టౌన్: న్యాయవాది, రచయిత బడుగు భాస్కర్ జోగేష్ రచించిన 'లిదియా పూలు సలామీ అఖాతం' కవితా సంపుటి పుస్తకావిష్కరణ కార్యక్రమం స్థానిక బార్ అసోసియేషన్ భవనంలో శనివారం నిర్వహించారు. అంబాజీపేటకు చెందిన కవి, రచయిత నామాడి శ్రీధర్ ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ పుస్తక రచయిత భాస్కర్ జోగేష్ తాను రాసిన కవిత్వంలో సౌందర్య దృష్టికి ఎంతటి ప్రాధాన్యత ఇచ్చారో వాస్తవికతను కూడా అంతే ప్రాధాన్యత ఇచ్చారని చెప్పారు. సంపుటిలో బాల్యం, యవ్వన కాలాల జ్ఞాపకాలతోపాటు సామాజిక ఘటనలు, రాజకీయ పరిణామాలను చక్కగా వివరించారని రచయిత భాస్కర్ జోగేష్‌ను శ్రీధర్ ప్రశంసించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతపల్లి అజయ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ ఆవిష్కరణ సభలో కవి భాస్కర్ జోగేష్ తల్లి ఈశ్వరమ్మ కవితా సంపుటి తొలి ప్రతిని స్వీకరించారు. కవి, సాహితీ విమర్శకులు సుంకర గోపాల్, కవులు, రచయితలు అవధానుల మణిబాబు, మధునాపంతుల సత్యనారాయణమూర్తి, దాట్ల దేవదానం రాజు, కోడూరి రామరాజు, ఎమ్మెస్ సూర్యనారాయణ, మిరప మహేష్, మోకా రత్నరాజులు మాట్లాడుతూ కవి భాస్కర్ జోగేష్ కవితా వైభవాన్ని వివరించారు. సీనియర్ న్యాయవాదులు డీబీ లోక్, ఎండీ ఆజామ్, అడపా ప్రసాద్, కుడుపూడి అశోక్, నందెపు చిన్న, నందిక శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల కేటాయింపులో అన్యాయం

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వం అంగన్‌వాడీ వర్కర్, హెల్పర్ పోస్టుల భర్తీకి విడుదల చేసిన నోటిఫికేషన్‌లో యానాం రీజియన్‌కు తీవ్ర అన్యాయం జరిగిందని శనివారం విశ్రాంత ఎస్ఎస్‌పీ అధికారి గుత్తుల జయరామారావు పేర్కొన్నారు. యానాంకు సంబంధించి అంగన్‌వాడీ వర్కర్లు–2, హెల్పర్లు–3 పోస్టుల మాత్రమే భర్తీ చేస్తున్నారని అన్నారు. అంగన్‌వాడీ వర్క ర్లు–30, హెల్పర్లు–29 పోస్టులు యానాంకు కేటాయించాలని ఆయన డిమాండ్ చేసారు. దీనిపై ప్రభుత్వానికి లేఖ రాయనున్నట్లు తెలిపారు.


వైభవంగా దుర్గమ్మ ఊరేగింపు



కేశనకుర్రులో అమ్మవారి ఊరేగింపు



కామాక్షీ పీఠంలో చండీ హోమం



ఇంజరం హరశ్రీ నిలయంలో చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

ఐ.పోలవరం: పలు గ్రామాల్లో దసరా నవరాత్ర మహోత్సవ ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలో మురమళ్లలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి, కేశనకుర్రు, కొమరగిరి, టి.కొత్తపల్లి, ఎదుర్లంక, జి.వేమవరం, ఐ.పోలవరంలో శనివారం ముగింపు వేడుకలు అట్టహాసంగా జరిగాయి. అమ్మవారి ఆలయాల వద్ద భారీ అన్నసమారాధనలు నిర్వహించారు. ఆలయాల నుంచి గౌతమీ, వృద్ధ గౌతమీ నదీపాయల వరకు అమ్మవారి భారీ విగ్రహాలను సుందరంగా అలంకరించిన ట్రాక్టర్లు, వ్యాన్లపై ఉంచి గరగ నృత్యాలు, మేళతాళాలు, వివిధ వేషధారణలు, కోలాటం, బాణ సంచా కాల్పులతో ఊరేగించారు. నదీపాయల్లో విగ్రహాలను, పూజా ద్రవ్యాలను నిమజ్జనం చేశారు.

కామాక్షీ పీఠంలో..

అమలాపురం టౌన్: స్థానిక శ్రీకామాక్షీ పీఠంలో శరన్నవ రాత్రి మహోత్సవాలు శనివారం నిర్వహించిన చండీ యాగంతో ముగిశాయి. చండీ సప్త పారాయణం ముగియడంతో చండీ మహా యాగం పూర్ణాహుతి వైభవంగా నిర్వహించారు. పూర్ణ దీక్షాపరులు బ్రహ్మశ్రీ గోవిందవఝల దుర్గా నాగేంద్ర భాస్కర శర్మ యాజ్ఞీకంలో పీఠం ఉత్తరాధికారి విఘనస రాఖీ ప్రేమ్ చండీ యాగాన్ని నిర్వహించారు. పెమ్మరాజు వీరేష్ ప్రసాద్, సుజాత దంపతులు మహా చండీ యాగంలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో శ్రీకామాక్షీ దేవి చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి, పీఠం ప్రేమ మందిరం అమ్మ వక్కలంక వాణి, ట్రస్టీలు వీరా నాగేశ్వరరావు, మట్టపర్తి సత్యనారాయణ, పీఠం మేనేజర్ మర్రి దుర్గారావు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో చండీహోమం

తాళ్లరేవు: శరన్నవరాత్ర మహోత్సవాలు ముగింపు సందర్భంగా శనివారం చండీ హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇంజరం హరశ్రీ నిలయంలో అర్చకుల నేతృత్వంలో దసరా వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాకరపర్తి వెంకట్రావు, పూర్ణిమ దంపతులతో చండీ హోమాన్ని నిర్వహించారు. మహా పూర్ణాహుతి నిర్వహించి అమ్మవారి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

అమ్మవారి ఆలయంలో హోమం

అమలాపురం రూరల్: శరన్నవరాత్రి మహోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం అమలాపురం మండలం ఎ. వేమవరప్పాడు నక్కా వారి పేటలోని విజయ దేవి అమ్మవారి ఆలయం వద్ద చండీ హోమం, గాయత్రి హోమం వైభవంగా నిర్వహించారు. గొవ్వాల అచ్యుతరామయ్య, సమరసత్త ఫౌండేషన్ ధర్మ ప్రచారక్ మేడిశెట్టి నాగభూషణం దంపతులు, ఉండ్రు మోహన్ కుమార్, పవిత్ర దంపతులు, నక్కా కేశవరావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పులిదిండి ఏడుకొండలు, నేరేడుమిల్లి గౌతం, పెండెం ధర్మరాజు, జల్లి దుర్గాప్రసాద్, బండి సత్యనారాయణ, పెండెం శ్రీనివాస్, పరమట చందు తదితరులు పాల్గొన్నారు.